# స్వయంకృతాపరాధం

శారద అప్పుడే వీధిలోకి బైలుదేరింది. తెల్లని చీర మీద నీలిరంగు బ్లౌజు యెంతో యింపుగా కనిపిస్తూ ఆమె అందానికి మెరుగు పెడుతున్నాయి. రామారావు దృష్టి ఆమెపై బడింది. అతని కళ్ళు చెదరిపోయినయ్. ఎంత అందంగా వుంటుంది శారద! మనసులో అనుకున్నాడు. అతని చూపులు ఆమెను వెన్నంటుతూనే వున్నాయి.

ఏదో పనిమీద బైటికి వచ్చిన సీతారత్నంకి, కొడుకు దృష్టి ఎక్కడో వున్నట్టనిపించి చూసింది. కాస్తంత దూరంలో శారద వెళిపోతూ వుండటం గమనించింది. లోలోన ముసి ముసి నవ్వులు నవ్వుకుంది.

"ఒరేయ్ అబ్బాయ్"... తను వచ్చినట్టు గుర్తు చేసింది.

రామారావు తృళ్ళిపడ్డాడు.

"ఏవమ్మా బజారు పనేమైనా వుందా?" తడబడు తూనే అన్నాడు

"బజారు జ్ఞప్తికి వచ్చిందేవిఁటి?" నవ్వుకుంటూనే లోపలికి పోయింది.

రామారావు తల్లిని అనుసరించాడు.

"ఏమిటలా తన్మయత్వంతో చూస్తున్నావురా?" అడిగింది మెల్లగా.

రామారావు తడబడ్డాడు.

"అబ్బే....యే....ఏమీ లేదమ్మా."

"అబద్ధాలెందుకురా! దొంగతనమేం కాదుగా! ధైర్యంగా చెప్పు. శారద వెళ్ళిపోతూవుంటే, చూస్తున్నావుగా!" నవ్వుతూనే అంది.

తల్లి నవ్వుతూ అనడం, రామారావుకి ధైర్యం చేకూర్చింది.

"ఎంత సూక్ష్మంగా గ్రహించేశావమ్మా!" మొహం దించుకుంటూనే అన్నాడు.

"వాళ్ళూ మనశాఖవాళ్ళే! బాగా డబ్బుంది కూడాను. నిజంగా, శారద యెంతో మంచి పిల్లరా! నాతో ఎంత ఆప్యాయంగా మాట్లాడుతుం దనుకున్నావు? ఆ ఆస్థంతటకీ ఆమె వారసురా లనుకుంటాను. ఔను మరి! ఒక్కగాని ఒక్క కూతురుగా....ఐనా యివన్నీ నా కెందుకులే! అన్నట్టు అలా బజారుకు పోయి, కాఫీ గుండ తీసుకురా" అంటూ వంటగది కేసి వెళ్ళిపోయింది.

రామారావు పుత్సాహంగా ఈల వేసుకుంటూ నిష్క్రమించాడు.

సీతారత్నం, కొడుకు చర్యల్ని సమర్థించడానికి కారణం లేకపోలేదు. శారద అందమైన అమ్మాయి నెమ్మదైన పిల్ల. కాలేజిలో చదువుతోంది. ముఖ్యంగా తలిదండ్రులకు ఒకేఒక్క కూతురు. బోలెడంత ఆస్తివుంది వాళ్ళకి. ఒకవేళ తన కొడుకే ఆమె ప్రేమకు పాత్రుడైతే, వీళ్ళిద్దరికీ వివాహం జరిగితే, అదృష్టవంతుడు తన కొడుకేగా! తమ అంతసుకంటె, వాళ్ళ అంతస్తు పెద్దది. శారద తన కోడలే అయితే, వాళ్ళ ఆస్తంతా యెప్పటికైనా తన కొడుక్కే దక్కుతుంది. అదీ ఆమె స్వార్థం. కొడుకు తప్పుచేస్తున్నాడని ఆమెకి అనిపించలేదు, పైగా అతన్ని ప్రోత్సహించినట్టుగా మాట్లాడింది.

*　　*　　*

రామారావు తండ్రి, రెండు చేతులా ఆర్జించి, కళ్ళు మూశాడు. ఆ డబ్బుని అనుభవిస్తున్నారు సీతారత్నం. రామారావును మంచి ప్రయోజకుణ్ని చెయ్యాలన్న అభిలాషతో, ఇంజనీరింగు చదివిస్తోంది సీతారత్నం. రామారావు అతి కష్టంమీాద ఫైనలియర్‌కి వచ్చాడు. ఈ సంవత్సరమైనా కష్టపడి చదవకపోతే, గట్టెక్కడం కష్టమేమో ననిపించిం దతనికి. అవుతే, పుస్తకం తెరిస్తేచాలు పాఠాలు అగుపించేవి కావు గాని, శారద బింబం లీలగా కనిపించేది. అతనికిప్పు డంతా శారదామయంగా వుంది. ఎలాగైనా ఆమెకి తన అభిప్రాయం తెలియజెయ్యా లనుకున్నాడు.

ఆ భావం రావడమే తడవుగా కూచుని, ఆలోచించి, ఆలోచించి, ఓ ప్రేమలేఖ రాశాడు. తన మనస్సంతా విప్పి చెప్పాడందులో. ఓ రోజు ధైర్యంచేసి, ఆ వుత్తరాన్ని ఆమెకు అందజేశాడు. అదైనా ఎవరో స్నేహితులు ఆమెకి యిమ్మన్నట్టుగా యిచ్చాడు

శారద ఆ వుత్తరాన్ని చదువుకుని, మండిపోయింది. ఏం చెయ్యడమో, క్షణంసేపు అర్థం కాలేదు చివరికి ఆ వుత్తరాన్ని తీసుకుపోయి తండ్రికి అందించింది.

"చూడండి నాన్నా. యెంత ధైర్యమో వీడికి," ఆమె కళ్ళు నీళ్ళపర్యంత మయ్యాయి.

రాఘవయ్య వుత్తరాన్ని చదివి రుద్రుడైపోయాడు.

"ఎవడమ్మా వీడు?"

"ఇంకెవడు మన పక్కింటి ప్రబుద్ధుడే! ఇంజనీరింగు చదువుతున్నందుకు సార్థకత యిది."

"సరే! వీడి పని పట్టిస్తానుండు అటో, యిటో తేల్చి వస్తా ..." అంటూ బైలుదేరాడు రాఘవయ్య ఆ వుత్తరాన్ని పట్టుకునే

"ఎక్కువ ఘర్షణ పడకండి నాన్నా! నాలుగుచీవాట్లు పెట్టి వచ్చేయండి" అని హెచ్చరించింది శారద.

రాఘవయ్య, చరచరా నిష్క్రమించాడు.

* * *

"రండి అన్నయ్యగారూ! ఇలా వచ్చి కూర్చోండి" లోపలికి నడిచింది. వరుసలు కలపడంలో ఆమె దిట్ట.

వీధిలో ఘర్షణపడ్డం మంచిదికూడా కాదనుకుని లోపలికి పోయి కూచున్నాడు.

"ఏమిటిలా ఏదో పనిమీదవచ్చారు అన్నయ్యగారు!"

"ఏముంది? మీ అబ్బాయి చేసిన ఘనకార్యం విన్నవించుకుందామని..."

"ఏమిటన్నయ్యా అది?"

"ఇదిగో; యీ వుత్తరం చదవండి....మీకే తెలుస్తుంది...." వుత్తరం అందించారు.

సీతారత్నం కళ్ళద్దాలు సర్దుకుని వుత్తరం చదివింది.

"ప్రేమలేఖలా వుంది."

"ఉండట మేమిటండీ! అది ప్రేమలేఖే!"

"మరింకేం? మావాడూ, మీ అమ్మాయీ, ప్రేమించుకుంటున్నా రన్నమాట..." చిన్నగా నవ్వుతూ అందామె.

రాఘవయ్యకి కంపరమెత్తింది. ఏమిటీ మనిషి! ఎంత తేలిగ్గా అనేస్తోందీ?....అనుకున్నాడు. "మా అమ్మాయి మీ వాడితో యెప్పుడూ మాట్లాడనే మాట్లాడదు. మీవాడు మాత్రం యివ్వాళ యీ ప్రేమలేఖరాసి అందించాడట. మా అమ్మాయి చిందులు తొక్కుతోంది...."కోపంగా అన్నాడు.

"ఏమీ తెలీకండా, వుత్తరం యెలా తీసుకుందన్నయ్య గారూ! తీసుకున్నాక, చిందులు తొక్కడ మెందుకండి చెప్పండి..."

"తను రాసిన ప్రేమలేఖని చెప్పుకుందుకూడా ధైర్యంలేని పిరికిపంద మీవాడు. అందుకే, యెవరో దాని స్నేహితులు అందజెయ్యమన్నారని యిచ్చాడట. ఇదేం మర్యాదగా లేదండీ! పెద్ద చదువులు చదువుతున్నా మనగానే సరికాదు, అందుకు తగిన సంస్కారం కావాలి. అనవసరంగా యెందుకీ రభసని వూరుకుంటున్నాను గాని, లేకపోతే నలుగురి మధ్య మీ వాణ్ణి నిలదీసి చెంపలు వాయించేవాణ్ణి...."

"అది మీ పిచ్చి అన్నయ్యగారూ! వాడెందుకు అవమాన పడాలి? మీ అమ్మాయికీ, తనకీ పరిచయం వుందని నలుగురికీ చెప్తాడు. వాడికేం? మగవాడు. అపవాదుపడేదీ, నలుగురినోట్లో పడేదీ మీఅమ్మాయే!" అంది నిబ్బరంగా సీతారత్నం.

రాఘవయ్యకి అంతులేని కోపం ముంచుకొచ్చింది. అతని కళ్ళు కెంపురంగును సంతరించుకున్నాయి "మీ గురించి నిజాన్ని యీ క్షణంలోనే తెలుసుకున్నానండీ, సీతారత్నం గారూ! తల్లిగా మీరతని బాగోగులు కోరి, అతడి ప్రవర్తనకి నాలుగు చీవాట్లు పెడతారని భావించానుగాని యిలా సమర్థిస్తారని అనుకోలేదు. మీతో అనవసరంగా వాదనల్ని పెంచుకోవడం, నా తెలివి తక్కువతనం. కాని, ఒక్క విషయం గుర్తుంచుకోండి. మీ యీ సమర్థనకి యెప్పటికైనా పశ్చాత్తాప పడతారు. వస్తా" అనేసి విసురుగా వెళ్ళిపోయాడు.

సీతారత్నం నవ్వుకుంది. తనకొడుకు ప్రయోజకత్వానికే ఆనంద పడిందేమో।

మరి కాస్సేపటికి రామారావు యింటికి వచ్చాడు. శారద వీధిగుమ్మంలో కనిపిస్తుందని చూశాడు గాని, నిరాశ యెదురయ్యింది.

రామారావు యింట్లో అడుగు పెట్టేసరికి సీతారత్నం అతనికి యెదురుగావచ్చి, రాఘవయ్య రావడం ఉత్తరం చూపించడం అన్నీ వివరంగా చెప్పింది.

"కొంప మునిగిందే?" అన్నాడు రామారావు.

"ఏం మునగలేదు. నువ్వు ముందామెను మంచి చేసుకో!" మరోసారి ప్రోత్సహించింది.

* * *

ఈ సంఘటన జరిగిన మూడోనాడు రాఘవయ్య యిల్లు మార్చేశాడు. అందుకు రామారావు హృదయం కించిత్ కల వరపడింది.

ఓనాడు శారద కాలేజీనుండి వస్తుంటే, రామారావు చూశాడు. ఆమె ఒంటరిగా నడుస్తోంది. అబ్బ! ఆ నడకలో కూడా యెంత వయ్యారంవుంది! అనుకుంటూనే ఆమెను సమీ పించాడు.

"ప్రేమలేఖలు యెవరైనా పెద్దవాళ్ళకి చూపించు కుటూ రటండీ! మీకు తెలీదు — నిజంగా మీకోసం నేను

యెలా అయిపోతున్నానో! నా ప్రేమ దేవత యెప్పుడు నన్ను కరుణిస్తుందా, అని యెదురు చూస్తున్నాను. కరుణించి నా లేఖకు ఓ జవాబు రాయండి! ఒక్క వాక్యం రాస్తే చాలు — నాజన్మ తరించిపోతుంది. ఇల్లు మార్చేసినంత మాత్రాన, మీరు నాకు దూరంకాలేదు. నా హృదయంలో సర్వదా మీరు స్థానం యేర్పర్చుకున్నారు....ఏమంటారు?" సినీమాలో హీరోలా డైలాగులు చెప్తూ ఆమె కేసి చూశాడు.

అంతే! అతని చెంప చెళ్ళుమంది. రామారావు కళ్లు తిరిగాయి. ఇంక అక్కడుంటే, వళ్ళు హూణం అవుతుందేమో నన్న భయంతో తిరుగుతున్న కళ్ళను కాస్త నిలద్రొక్కుకొని సైకిలెక్కి పిక్కబలం చూపించాడు.

శారద కిలకిలా నవ్వుకుంది! 'పీడ వదలింది' అనుకుంది నిట్టూరుస్తూ.

ఈ సంఘటన మాత్రం రామారావు తల్లితో చెప్ప లేదు. ఏ మొహం పెట్టుకు చెప్తాడు? సిగ్గుచేటు కదూ! శారద మాత్రం తండ్రితో చెప్పి కడుపు చెక్కలయ్యేలా నవ్వుకుంది. రాఘవయ్యకూడా కూతురి నవ్వులో తన నవ్వు కలిపాడు. రామారావుకి తగిన శిక్ష జరిగిందనుకున్నాడు.

రామారావు దృష్టి ఈసారి లీలపై బడింది. ఆకర్ష ణీయంగా వుంటుంది. అయితే, ఆమె శారదలాంటి అందమైన అమ్మాయికాదు. ఆమెలోని ఆకర్షణే రామారావుని గాలం వేసి లాగింది. ఆమె పరిచయానికి తహతహ లాడాడు. తనకి వచ్చిన భాషంతా వుపయోగించి ఓ ప్రేమలేఖ రాశాడు. ఈ

విషయంలో అతణ్ణి అదుపులో వుంచేవాళ్ళేవరూ లేరు కాబట్టి, మరీ స్వేచ్ఛ దొరికింది.

అతని ప్రేమ లేఖకి జవాబు అందింది. ఎంతో అనురాగంతో రాసిన జవాబది. రామారావు లీల రాసిన జవాబును పదేపదే చదువుకుని మురిసిపొయ్యాడు. దాన్ని హృదయానికి హత్తుకున్నాడు. ఆ రోజునుండే వాళ్ళ పరిచయం దిన దిన ప్రవర్థమాన మయ్యింది. ఇరువురూ కలిసి తిరగడం ప్రారంభించారు.

లీల బి.ఏ. చదువుతోంది. ఆమెకి చదువుమీద ఆసక్తి కంటే, చదువుకుంటే, ఒక అంతస్థుగలభర్తను పొందవచ్చునసే ఆసక్తి అధికంగావుంది. అందుకే చదువుతోంది. ఆమె తండ్రి, యేమీ ఆస్తిపాస్తులున్న వాడేం కాదు. అయినా, కూతురి ఆసక్తి గమనించి, యెలాగో చదివిస్తున్నాడు.

అటువంటి మన స్త్రత్వంగల లీల, యీ సదవకాశాన్ని వదులుకోలేక పోయింది.

ఓనాటి సాయంత్రం—

రామారావు, లీల కాలవగట్టున పచ్చికలో కూర్చున్నారు. సంజ వెలుగు యెంతో హృద్యంగా వుంది. కాలవ నీరు మెల్లగా పారుతూ, వింత సంగీతాన్ని అందిస్తోంది. చెట్ల మీదకి పక్షులు చేరుకుంటూ కిలకిల ధ్వని చేస్తున్నాయి.

రామారావు, లీల మొహం కేసి తదేకంగా చూస్తూ, క్షణం మైమరిచాడు.

"ఏమిటి లీలా, అలా మౌనంగా ఆలోచిస్తున్నావు? వాతావరణం, యెంత హాయిగావుందో చూశావా? సరదాగా కబుర్లు చెప్పుకోవాల్సిన సమయమిది. ఏదైనా మాట్లాడు..." అన్నాడు ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని.

లీల అతని మొహంలోకి చూచి, ఆ సన్నని పెదాలపై మందహాసం చిందించింది. ఆ మందహాసం రామారావుని మరీ మత్తెక్కించింది.

"ఇలా యెన్నాళ్ళు రహస్యంగా తిరుగుతామండీ?" అందామె.

ఆమె మృదు మధుర కంఠస్వరం, రామారావుని మరో లోకానికి తీసుకుపోయింది

"ఇంకెన్నాళ్ళు లీలా? మరి మూణ్ణెల్లు ఆగు ఫైనలియర్ అవుతుంది. వెంటనే వివాహం చేసుకుందాం."

"అది బాగానే వుంది. కాని, మనం రిజిష్టరుమారేజి చేసుకుంటే, పరీక్షలకి అది యే విధమైన అడ్డూ రాదుగా!"

"అంటే, నన్ను నమ్మలేకుండా వున్నావా యేమిటి?"

"ఇలా మీరు అపార్థం చేసుకుంటే, నేనేం చెయ్యను? నాకూ కొంత తృప్తి వుంటుంది. నిశ్చింతగా నిద్రపోతాను. మీరూ ఆలోచించండి."

రామారావు, మంచి సందిగ్ధంలో పడ్డాడు. లీల, తమ కులంకాదు. అయినా ఆమెను వదులుకోలేడు. ఈ యిరవయ్యో శతాబ్దంలో ఎవరీఆచారాలన్నీ పట్టించుకుంటున్నారు?

సంస్కారంగల తమలాంటి వాళ్ళు పురోగమించాలి. అప్పుడే పాత పద్ధతులు, కాలం మరుగున పడతాయి. తను వివాహం చేసుకున్నాక, అమ్మ ఆటంకపర్చినా, వచ్చిన నష్టమేమిటి? శారదకోసం తను పరితపిస్తున్న ఆ రోజుల్లో, అమ్మ తనని ప్రోత్సహించింది కూడాను. ఇప్పుడుమాత్రం ఏమంటుంది?.... అన్న ధైర్యం తెచ్చుకున్నాడు.

"సరే లీలా! రేపేవెళ్ళి వివాహం చేసేసుకుందాం... " అన్నాడు నిబ్బరంగా.

లీల మురిసిపోతూ తన్మయత్వంతో అతని వడిలో వాలి పోయింది! అప్పుడే చంద్రుడు పైకి వస్తున్నాడు నవ్వుకుంటూ.

* * *

నిశ్చయించుకున్న విధంగా, రామారావు లీలల వివాహం జరిగింది. ఆ విషయం, సీతారత్నంకి తెలీదు పాపం!

మూడు నెలలు గడిచాయి. రామారావు చదువుపూర్తయ్యింది. పరీక్ష తృప్తికరంగానే రాశాడు. అవుతే, అతను నెగ్గుకు రావల్సిన మరో పరీక్ష వుంది. లీలను తమ యింటికి తీసుకుపోవడం! ఆ పరీక్షలో నెగ్గడానికి ధైర్యమే ప్రధానమనుకున్నాడు.

ఓరోజు, లీలను తీసుకుని ఇంటికి వచ్చాడు. లీల అప్సరసలా తయారయ్యింది. అందంలో యెవరికీ తీసి పోదన్నట్టుగా, ఆకర్షణీయంగా తయారయ్యింది. ముందుగదిలో యిద్దరూ నుంచుని 'అమ్మా' అంటూ కేక వేశాడు రామారావు.

సీతారత్నం ఉత్సాహంగా లోపల్నించి వచ్చింది. కాని, కొడుకుని, అతనిప్రక్క ఓ యువతినీ చూసి ఆమె ఉత్సాహం నీళ్ళుగారిపోయింది.

"మా అమ్మ కాళ్ళకు నమస్కారంచేయి లీలా. అమ్మా మీ కోడల్ని ఆశీర్వదించు" అన్నాడు రామారావు.

సీతారత్నం స్తంభించిపోయింది. పాదాలకు నమస్కరిస్తున్న లీలను లేవదీస్తూ, "ఈ అమ్మాయి యెవర్రా?" అంది బొంగురు పోయిన స్వరంతో.

"ఎవరై తేనేమమ్మా మేం వివాహం చేసుకున్నాం"

"వివాహం. చేసుకున్నారా?" తెల్లపోయింది సీతారత్నం.

"ఔనమ్మా! రిజిష్టరీ మారేజ్ చేసుకున్నాం."

"పోనీ, మన కులంవాళ్ళేనా?" నిస్సహాయంగా అంది.

"ఈ ఇరవయ్యో శతాబ్దంలో అవన్నీ చూడ్డం సభ్యత కాదమ్మా! వర్ణాంతర వివాహాలకే యెక్కువ విలువవుంది."

సీతారత్నంకి, కళ్ళు తిరిగినట్లయ్యింది. మొహం పాలిపోయింది.

"ఇదేం అన్యాయంరా! మన ఇంటా, వంటాలేదు. వర్ణాంతర వివాహం చేసుకుని మన గౌరవమే మంటగలిపావు..." అంది వగరుస్తూ.

"ఇవి ప్రేమ పెళ్ళిళ్ళమ్మా! అదునాతన యుగసభ్యత యిది! వాళ్ళపాత ఆచారాలు ఇంకా అమల్లో వుండడానికి వీల్లేదీ విప్లవయుగంలో" చిన్న ఉపన్యాస మిచ్చాడు.

"పోనీ వీళ్ళకి డబ్బుందా?" చివరి ప్రశ్నగా వేసింది.

రామారావు చిన్నగా నవ్వేడు.

"మనకిప్పున్న డబ్బు చాలదా అమ్మా? మరొకరి డబ్బుకోసం యెందుకు చూడ్డం?"

సీతారత్నం నిట్టూర్చింది.

"అయినా, నీకెందుకు పుట్టిందిరా యీ బుద్ధి! నేనే ఓ సలక్షణమైన సంబంధం చూసి, పెళ్ళి చేద్దునుగా!" సుమారు ఏడుపు ధోరణిలో అందామె.

"ఈ ప్రేమ వ్యవహారాలకు నువ్వెప్పుడూ అడ్డు చెప్ప లేదు కదమ్మా! అందుకే నువ్వు నాకు స్వేచ్ఛ ఇచ్చావను కున్నాను..."

సీతారత్నంకి, గతం జ్ఞప్తికివచ్చింది. ఆనాడు శారద విషయంలో తను కొడుకుని ప్రోత్సహించడమే ముప్పు తెచ్చిందిప్పుడనుకుంది. అప్పుడే తను వాణ్ణి వారించివుంటే పరి స్థితి ఇంతగా మించిపోయి వుండదు. ఇప్పుడు తను విచారించి మాత్రం ఏంలాభం? ఇది స్వయంకృతం....అనుభ వించా ల్సిందే!

"ఔను రామం! ఇది నా తప్పుకు శిక్ష! అనుభవించక తప్పదు. పదమ్మా లోపలికి..." అంటూ కోడల్ని తీసుకు పోయింది సీతారత్నం ఆప్యాయంగా. ఆమెమనసులో ఎంతో సంక్షోభంవుంది. అయినా వ్యక్తం చెయ్యకుండా అనుభవిస్తోంది.

రామారావు తృప్తిగా నవ్వుకున్నాడు.